ప్రజాశక్తి
శుక్రవారం 3 ఫిబ్రవరి 2023
5
శ్రీకాకుళం

ప్రజా వ్యతిరేక బడ్జెట్

- కార్పొరేట్లకు రాయితీలు.. సామాన్యులపై భారాలు
- హోదా, విభజన హామీలపై మరోసారి మోసం
- బడ్జెట్‌కు నిరసనగా 22 నుంచి 28 వరకు ఆందోళనలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు


సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లోక్‌సభలో ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేసిందని, ఉన్న సబ్సిడీల్లో కోత విధించిందని చెప్పారు. ఈ బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.30 వేల కోట్లు, ఆహార సబ్సిడీలో ఏకంగా రూ.90 వేల కోట్లు కోత పెట్టిందని తెలిపారు. ఎరువులపై సబ్సిడీలు రూ.50 వేల కోట్లకు, వ్యవసాయ రంగానికి ఐదు శాతం గత బడ్జెట్ కంటే తగ్గించిందని చెప్పారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు నిధుల కేటాయింపు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్‌ప్లాంట్, పోలవరం, విశాఖ మెట్రోకు నిధుల ఊసే లేదని విమర్శించారు. సంపద సృష్టిస్తున్న కార్మికుల కోసం కనీసం ప్రస్తావన లేదన్నారు. ఉపాధి కల్పన ప్రాజెక్టుల్లో ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచాలని, ఉపాధి హామీ కేటాయింపులను పెంచి కూలీలకు గరిష్ట కూలిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలతో పాటు ఐదు కిలోల సబ్సిడీ ఆహార ధాన్యాలను పునరుద్ధరించాలన్నారు. ఆహార పదార్థాలు, మందులతో సహా నిత్యావసరాలపై జిఎస్‌టిని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లోని ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలు, కోతలకు వ్యతిరేకంగా ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వెలుగులు ఎప్పుడు..?

- జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాల లక్ష్యం 54,892
- విద్యుత్ సరఫరాకు సిద్ధంగా ఉన్నవి 1518 గృహాలు
- కనెక్షన్లు ఇచ్చినవి 991
- మందకొడిగా సాగుతున్న విద్యుద్దీకరణ పనులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికీ విద్యుత్ సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. స్తంభాల ఏర్పాటు, లైన్లు వేయడంలో తీవ్ర జాప్యమవుతోంది. ఈ ఏడాది జులైలో విద్యుద్దీకరణ పనులు ప్రారంభించినా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. ఫలితంగా వేలల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా, వందల సంఖ్యలో ఇళ్లకు మాత్రమే కరెంట్ కనెక్షన్లు ఇచ్చారు. మరోవైపు ప్రభుత్వం ఉగాది నేపథ్యంలో మార్చి 22న తేదీన సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించింది. ఆ సమయానికి అన్ని ప్లాట్లకు విద్యుత్ సరఫరా చేయడంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 877 లేఅవుట్లను వేశారు. ఇందులో ఇళ్ల నిర్మాణం చేపడుతున్న 54,892 మందితో పాటు సొంత స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుంటున్న 42,463 మందికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. గతేడాది డిసెంబరులో ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. వీటిలో విద్యుద్దీకరణ పనులు ఆంధ్రప్రదేశ్ ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిఈపిడిసిఎల్) చేపట్టింది. విద్యుద్దీకరణ పనుల కోసం శ్రీకాకుళం, టెక్కలి డివిజన్ల పరిధిలో పనులు చేయడానికి ఇద్దరు కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని శ్రీకాకుళం టౌన్, రూరల్ సబ్ డివిజన్లు, ఆమదాలవలస సబ్ డివిజన్‌లోని జి.సిగడాం, బూర్జ, కొత్తూరు, హిరమండలంతో పాటు ఉమ్మడి జిల్లాలోని రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లో పనులను చేపట్టేందుకు విజయవాడకు చెందిన జివిఎస్ ప్రాజెక్ట్సు లిమిటెడ్‌ను ఎంపిక చేశారు. టెక్కలి డివిజన్ పరిధిలో పనులకు శ్రీలక్ష్మి ఎలక్ట్రికల్స్ సంస్థను ఎంపిక చేశారు.

956 ఇళ్లకే కనెక్షన్లు

లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లకూ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 54,892 ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు అయినవి 1518 ఉన్నాయి. వీటిలో విద్యుత్‌శాఖ అధికారులు 991 ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వగలిగారు. కాశీబుగ్గలో 17 ఇళ్లు పూర్తి కాగా, ఒక్క ఇంటికీ కనెక్షన్ ఇవ్వలేదు. శ్రీకాకుళం అర్బన్‌లో 53 పూర్తి కాగా, ఐదింటికే విద్యుత్ సరఫరా ఇవ్వగలిగారు. జలుమూరు మండలంలో 144 ఇళ్లు పూర్తి కాగా 71 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. టెక్కలిలో 67 ఇళ్లు పూర్తి కాగా 20 ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించారు. ఎచ్చెర్లలో 130 ఇళ్ల నిర్మాణం జరగగా 73 ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చారు. ఇచ్ఛాపురంలో 53 ఇళ్లు నిర్మాణం పూర్తి కాగా, 30 ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించారు. సొంత స్థలాల్లో 13,642 మంది ఇళ్లను పూర్తి చేయగా 13,593 ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించారు.

విద్యుత్ సరఫరాకు సిద్ధంగా ఉన్నవి 1518 ఇళ్లే

జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లలో విద్యుత్ సరఫరాకు అనుగుణంగా 1518 ఇళ్లే ఉన్నాయి. లేఅవుట్లలో మొత్తం 54,892 మందికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో కనెక్షన్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఇచ్ఛాపురం అర్బన్‌లో 2,208 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా, రెండు ఇళ్లు మాత్రమే పూర్తయాయి. మందసలో 1428 ఇళ్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు నాలుగు పూర్తయ్యాయి. ఆమదాలవలస అర్బన్‌లో 551 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా ఏడు గృహాలు పూర్తయ్యాయి. పొందూరులో 1099 గృహాలను నిర్మించాల్సి ఉండగా, పది ఇళ్లు విద్యుత్ సరఫరాకు అనుగుణంగా ఉన్నాయి.కాశీబుగ్గలో 2,624 లక్ష్యం కాగా 17 ఇళ్లు గృహాలు పూర్తయ్యాయి. శ్రీకాకుళంలో 7,597 గృహాలు లక్ష్యం కాగా 53 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. గారలో 2,489 గృహాలు నిర్మించాల్సి ఉండగా 50 ఇళ్లు విద్యుత్ సరఫరాకు అనుగుణంగా ఉన్నాయి. ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టేలా జిల్లాలో 33,269 ఇళ్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎన్ని గృహాలకు విద్యుత్ సరఫరా అందించనున్నారో చూడాల్సి ఉంది.

విద్యుద్దీకరణ పనులు వేగవంతం

జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్ల జాప్యం వల్ల కాలనీల్లో విద్యుద్దీకరణ పనుల్లో కొంత జాప్యమైంది. ట్రాన్స్‌ఫార్మర్ల వరకు కంపెనీ అందిస్తుంది. మిగిలిన మెటీరియల్ కాంట్రాక్టర్లే సమకూర్చుకోవాలి. స్తంభాలు, వైర్లు తదితర మెటీరియల్‌కు కొరత లేదు. అదనంగా మనుషులను ఏర్పాటు చేసి అనుకున్న సమయానికే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించాం. విద్యుద్దీకరణ పనుల్లో ప్రస్తుతం పురోగతి కనిపిస్తోంది.

- ఎల్.దైవప్రసాద్, ఎస్ఇ, ఎపిఈపిడిసిఎల్

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - కంచిలి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతుసంఘం, అఖిలపక్షాల ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. ఈ ఏడాది పంట దిగుబడి అధికంగా ఉన్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో లక్ష్యాలు విధిస్తూ, రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జాతీయ రహదారిని నిర్బంధిస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ హైమావతికి అందజేశారు. ఈనెల 15వ తేదీలోగా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో వైసిపి జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, టిడిపి నాయకులు మాదిన రామారావు, రైతుసంఘం నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, కె.గోపీనాథ్, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు ఆటో ఛార్జీలు

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - జలుమూరు, ఆమదాలవలస

హైరిస్క్ గర్భిణులు అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనంలో కాకుండా ఆటోలో ఆస్పత్రికి వస్తే ఆటో ఛార్జీనీ చెల్లించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి స్పష్టం చేశారు. జలుమూరు మండలంలోని అచ్యుతాపురం, సైరిగాం ఆమదాలవలస మండలంలోని అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, హాజరు పట్టికలను, పిహెచ్‌సిల్లో వసతులను పరిశీలించారు. నాడు-నేడు పనులు, ఫేస్ అటెండెన్స్‌పై ఆరా తీశారు. వార్డులను పరిశీలించి, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. మాతాశిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నెల తొమ్మిదో తేదీన గర్భిణులకు ప్రధానమంత్రి మాతృ వందన కార్యక్రమంలో అన్నిరకాల పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిసి కె.వి నారాయణరావు, వైద్యాధికారులు పి.గురునాథరావు, కె.అప్పారావు, కె.మీనా కుమారి, బి.వసంత, పి.సుజాత, కె.వైష్ణవి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


అచ్యుతాపురం పిహెచ్‌సిలో వార్డులను తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

డ్రైవర్ల నైపుణ్యమే భద్రతకు భరోసా

ప్రజాశక్తి - శ్రీకాకుళం


ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న రవికుమార్

ఆర్‌టిసిలో పనిచేస్తున్న డ్రైవర్ల నైపుణ్యమే ప్రయాణికుల భద్రతకు భరోసానిస్తోందని విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. నగరంలోని రెండో డిపో గ్యారేజ్ ఆవరణలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. బస్సులను ప్రమాదరహితంగా నడపడంలో డ్రైవర్లు మంచి ప్రగతి కనబరిచారని కొనియాడారు. శతశాతం ప్రమాద రహిత డ్రైవింగ్ లక్ష్యం చేరేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అంకితభావంతో సిబ్బంది విధులు నిర్వర్తించడం వల్లే అర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తే సురక్షితమన్న భావన ప్రజల్లో కలిగించగలిగామని చెప్పారు. రవాణా శాఖ ఉప కమిషనర్ సిహెచ్.శ్రీదేవి మాట్లాడుతూ ఆర్‌టిసి సిబ్బంది సమయపాలనతో పాటు భద్రతా చర్యలు పాటించడం వల్లే ప్రయాణికుల్లో మంచి అభిప్రాయం ఏర్పరుచుకోగలిగారని చెప్పారు. అనంతరం అత్యధిక కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లకు ప్రశంసాపత్రాలను అందించారు. డీజిల్‌ను పొదుపుగా వినియోగించినందుకు కేంద్ర రవాణశాఖ నగదు బహుమతికి ఎంపికైన రెండో డిపో సిబ్బందికి రూ.75 వేలును అందించారు. సమావేశంలో డిఎస్‌పి ప్రసాద్, ఎంవిఐ గంగాధర్, డిపిటిఒ విజయకుమార్, డిసిఇ అప్పలనాయుడు, వర్స్ మేనేజర్ వరలక్ష్మి, రెండో డిపోప పూర్వపు మేనేజర్ కవిత, మేనేజర్లు మాధవ్, శర్మ, శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

9 వరకు ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్


జాతీయ బృందం సభ్యులతో మాట్లాడుతున్న చిట్టిరాజు

జిల్లాలో ఉపాధి హామీ పనుల తీరును క్షేత్రస్థాయిలో ఈనెల తొమ్మిదో తేదీ వరకు పరిశీలించనున్నట్లు జాతీయ పరిశీలన బృందం సభ్యులు గిరిజశంకర్ పాడి, సత్యనారాయణ రౌత్ తెలిపారు. జిల్లా కేంద్రానికి గురువారం చేరుకున్న బృందం సభ్యులు డ్వామా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి చిట్టిరాజు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ ప్రాథమిక లక్ష్యాలు ఎంతమేర అమలవుతున్నాయన్నది పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామన్నారు. వాటర్‌షెడ్ పథకంతో పాటు ఉపాధి హామీ అమల్లో భాగంగా జిల్లాలో చేపడుతున్న పనుల వివరాలను తెలుసుకున్న తర్వాత క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లనున్నట్లు తెలిపారు. డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, సుస్థిర వనరులను సృష్టించడం, భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెద్దఎత్తున పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కూలీలకు సకాలంలో కూలి డబ్బులను చెల్లిస్తున్నట్లు చెప్పారు. జాబ్‌కార్డుదారులకు గరిష్ట కూలి అందించడమే ధ్యేయంగా సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించినట్లు వివరించారు. ప్రస్తుతం సగటు వేతనం మెరుగైన స్థాయిలో ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేశామని, క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రసాదరావు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడిలు హరిత, లోకేష్, రవి, సూపరింటెండెంట్‌లు ఎం.రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మెప్మా డైరెక్టర్ వి.విజయలక్ష్మి అన్నారు. స్థానిక రైతుబజారు వద్ద ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్టును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సుస్థిరమైన జీవనోపాధిని ఏర్పాటు చేసుకుని కుటుంబ జీవనం మెరుగుపరచుకునేందుకు మహిళా మార్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో స్వయం సహాయక సంఘ మహిళలను భాగస్వామ్యం చేస్తున్నట్లు చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిల్లర వర్తకంలో మహిళలు నిలదొక్కుకోవాలన్నారు. మహిళా సాధికారత సాధించేందుకు 18,278 మహిళా సంఘ సభ్యులు రూ.150 చొప్పున రూ.27,41,750 వాటా ధనంగా పెట్టుబడి పెట్టి జగనన్న మహిళా మార్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మెప్మా పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మహిళా మార్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇచ్ఛాపురం, పలాస మున్సిపాల్టీల్లో మహిళా మార్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జగనన్న మహిళా మార్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహిళలకు వివరించారు. కార్యక్రమంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అనివెట్టి మండలంలో ఆమెకు ఆలయ సూపరిటెండెంట్ కె.వెంకటేశ్వరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

బాబు ఉత్తరాంధ్ర ద్రోహి

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - మందస



టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్ర ద్రోహి అని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. మండలంలోని జిల్లుండ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిమిరియాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం రాజధానిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించారని, త్వరలో ఇక్కడ్నుంచే పాలన ప్రారంభం కాబోతుందన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతాయన్నారు. రాజధాని ప్రకటనపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పారు. అమరావతిలో తన మనుషులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ఆరోపించారు. అందుకే మూడు రాజధానులకు వ్యతిరేకంగా కోర్టులో కేసులు వేయించిన నీచ చరిత్ర చంద్రబాబుది అని విమర్శించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో రెండు, మూడు స్థానాలకే పరిమితం చేసి గుణపాఠం చెప్పాలన్నారు. సంక్షేమ పథకాల విషయంలోనూ చంద్రబాబు అవహేళన చేస్తున్నారని చెప్పారు. పొరపాటున ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితే ఈ పథకాలేవీ అందవన్నారు. గతంలో గ్రామాల్లో ఏదైనా పని కావాలంటే మండల కేంద్రం చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే తప్ప జరిగేవి కావని, గ్రామ సచివాలయ వ్యవస్థతో ఆ పద్ధతే మారిపోయిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని చెప్పారు. పలు సమస్యలను గ్రామస్తులు చెప్పగా, వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, వైస్ ఎంపిపిలు ఆదినారాయణ, సీర ప్రసాద్, తహశీల్దార్ పాపారావు, ఎంపిడిఒ తిరుమలరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సొర్ర ఢిల్లేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు ఎ.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



యువ టూరిజం క్లబ్‌తో పర్యాటక అభివృద్ధి

జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువ టూరిజం క్లబ్ ద్వారా పర్యాటక అభివృద్ధి సాధ్యమని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక కార్యక్రమం యువ టూరిజం క్లబ్‌లో భాగంగా జిల్లాలో తొలి క్లబ్ ఏర్పాటుకు ముందడుగు పడింది. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యువ టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన విద్యార్థులతో టూరిజం క్లబ్ సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

ఈ క్లబ్ జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాల గురించి మరింత ప్రచారం చేయడం ప్రధాన అజెండాగా పనిచేస్తుందన్నారు. ఇందుకోసం క్లబ్ సభ్యులకు జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన తర్ఫీదును అందిస్తారని చెప్పారు. తర్ఫీదు పొందిన క్లబ్ సభ్యులు తదుపరి టూరిజం గైడ్స్‌గానూ ఉపాధి పొందే అవకాశమూ ఉంది.

బృహత్తర లక్ష్యంతో జిల్లాలో బాధ్యతలు తీసుకున్న యువ టూరిజం క్లబ్ సభ్యులు జిల్లా పర్యాటక ఉన్నతికి పాటుపడాలని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లాలో వృద్ధి లేక మరుగున పడిపోతున్న ఎన్నో ప్రదేశాలు యువ టూరిజం క్లబ్ వల్ల మనుగడ లోకి వస్తే అదే అసలైన విజయమని కాంక్షించారు. కార్యక్రమంలో సామాజికవేత్త వై.గీతా శ్రీకాంత్, డిపిఆర్ఒ బాలమాన్ సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు, యువజన సర్వీసుల శాఖ అధికారి గీత, కళాశాల అధ్యాపకులు, హిస్టరీ విభాగాధిపతి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఆహా..! అన్విత

అలరించిన చిన్నారి కూచిపూడి నృత్యం

బూర్జ : మండలంలోని కాళపర్తిలో ముచ్చటమ్మ జాతర మహోత్సవాల్లో చిన్నారి అన్విత బగాది చేసిన కూచిపూడి నృత్యం ఆద్యంతం అలరించింది. హైదరాబాద్‌కు చెందిన తొమ్మిదేళ్ల చిన్నారి అన్విత చేసిన నృత్యం ఆహూతులను కట్టిపడేసింది.

డిటిపై 'దిశ' కేసు

ప్రజాశక్తి - సోంపేట

ఇన్‌ఛార్జి తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ ఎన్.రమేష్ కుమార్‌పై పోలీసులు దిశ చట్టం కింద కేసు నమోదు చేశారు. మండలంలోని మొగలికొత్తూరుకు చెందిన దళిత మహిళను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

25, 26న ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఐఎఫ్‌టియు 9వ రాష్ట్ర మహాసభలను శ్రీకాకుళం నగరంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు వెల్లడించారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో గురువారం నిర్వహించిన ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర మహాసభలను నగరంలోని శాంతినగర్ కాలనీలో గల కళింగ భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐఎఫ్‌టియు అఖిల భారత మహాసభలను తిరుపతిలో ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి క్రాంతి, దుర్గాసి గణేష్, ఎపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నీలంరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

గార ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని శ్రీకాకుళం, గార మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకుల పోస్టులకు సంబంధించి నియమించిన వారికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నియామక పత్రాలను అందజేశారు. పెద్దపాడులోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. బాధ్యతతో, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ రాధామాధవి, వైసిపి నాయకులు చిట్టి జనార్ధనరావు, గేదెల చెంగలరావు తదితరులు పాల్గొన్నారు.


నియామకపు పత్రాలను అందజేస్తున్న ధర్మాన

గండ్రేడువాసికి గౌరవ డాక్టరేట్

పొందూరు: మండలంలోని గండ్రేడు గ్రామానికి చెందిన కనిమెట్ట శ్రీకాంత్‌కు సామాజిక సేవా విభాగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. 22 సంవత్సరాలుగా వివిధ జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల్లో పని చేసినందుకు బెంగుళూరుకు చెందిన ఎసిటిఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఈ డాక్టరేట్‌ను ప్రకటించింది. గురువారం విశాఖపట్నంలోని సెంట్రల్ లైబ్రరీలో జరిగిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ టి.శోభశ్రీ, ఎసిటిఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుయకేషన్ రిజిస్ట్రార్ డి.దేవాప్రసాద్ ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.


డాక్టరేట్‌ను అందుకుంటున్న శ్రీకాంత్

రణస్థలం గ్రంథాలయం తనిఖీ

రణస్థలం: రణస్థలం శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ సెస్ బకాయిలను వసూలు చేయాలని కోరారు. ఆయనతో పాటు గ్రంథాల సంస్థ జూనియర్ అసిస్టెంట్ కె.చిరంజీవి. గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజు

హెల్మెట్ తప్పనిసరి

టెక్కలి రూరల్: వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఐ ఎల్.రామకృష్ణ అన్నారు రోడ్డు భద్రతా వారోత్సవాలు భాగంగా గురువారం ఇందిరాగాంధీ జంక్షన్‌లో హెల్మెట్ వాడకంతో కలిగే ప్రయోజనాలు, ధరించకుంటే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుండి రక్షించుకోవచ్చని వివరించారు. ద్విచక్ర వాహనదారులందరూ ప్రయాణం చేస్తున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిత

లావేరు: ఉజ్వల భవిష్యత్ కోసం విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని తామాడ ఆదర్శ పాఠశాలలో శ్రీశ్రీ ఫౌండేషన్ & దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. దానేటి శ్రీధర్, సిఐ ఆదాం, లావేరు ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు వైద్యులు శ్రీధర్‌ను దుశ్శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ పలు కోర్సులకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.డేనియల్, డాక్టర్ కొల్లి ఈశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, పౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వంతెన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలిలో రైలా ఖానాపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం భూమి పూజ చేశారు. బ్రిటిష్ పరిపాలన కాలంలో నిర్మించిన ఈ వంతెన శిథిలమైంది. దీని నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరయ్యాయి. అనంతరం కంట్రగడ జంక్షన్ నుండి మర్రిపెట్టు వరకు ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. విశాఖ పరిపాలన రాజధానిగా ప్రకటించడం.. పాలన కార్యకలాపాలు విశాఖపట్నంలో నిర్వహిస్తామన్న సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం చిన్న హంస పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గాంధీ, సరస్వతీదేవి, స్వలంత బొడ్డపాటి లింగాల విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎన్.దేవేంద్రరావు, వైసిపి మండల కన్వీనరు పి.యోగి, గొప్పిలి సర్పంచ్ జయమ్మ, ఇందిర, గోకర్ణపురం సర్పంచ్ రవికుమార్, ఎస్ఐ నర్సింగరావు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెడికల్ షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని పలు మెడికల్ షాపుల్లో అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి చంద్రరావు మాట్లాడుతూ ప్రిస్క్రిప్షన్ లేకుండా పెయిన్ కిల్లర్, యాంటీబయోటిక్ అమ్మకాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అందుకే ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఇకపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్న మెడికల్ షాపులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కవిటి మండలంలోని పలు మండల షాపులతో పాటు ఇచ్ఛాపురంలో కూడా తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో డిఐ కె.కల్యాణి, కానిస్టేబుల్ ఎస్.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

26న సైన్స్ ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి-రణస్థలం

ఈ నెల 28న సైన్స్ డే సందర్భంగా వై డ్రీమ్ అకాడమీ ఆధ్వర్యాన 26న సైన్స్ ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ త్రినాథరావు తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఎంఇఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై డ్రీమ్ అకాడమీ డైరెక్టర్ కళా వెంకటరావు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10గంటలకు శ్రీ సాయి జూనియర్ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు 6 నుంచి పదో తరగతి విద్యార్థులు హాజరు కావాలని కోరారు. విజేతలకు బహుమతులు ఉంటాయని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 8300123236ను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపియస్ స్టేట్ సర్కిల్ ప్రతినిధి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల వైద్యానికి 'హెల్పింగ్'

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మందస మండలం సాబకోట గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారుల వైద్యానికి హెల్పింగ్ హేండ్ సంస్థ ఆర్థిక సాయం అందించారు. గురువారం సంస్థ ప్రతినిధి గార్లెసలోని జెమ్స్ ఆసుపత్రికి వెళ్లి రూ.5 వేలను అందించారు. సాబకోటకు చెందిన సవర భాస్కరరావు కూలి చేసుకుని బతుకుతున్నాడు. ఈయనకు అంకిత్, సందీప్ ఇద్దరు కుమారులున్నారు. రోజు గడవడమే కష్టంగా మారిన నేపథ్యంలో ఇద్దరు కుమారులకు ఒకేసారి ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో జెమ్స్‌కు తీసుకువచ్చారు. వైద్య ఖర్చులు భరించలేకపోతున్నారని తెలుసుకుని హెల్పింగ్ హేండ్ ప్రతినిధులు తక్షణ సాయంగా ఆ మొత్తాన్ని సమకూర్చారు.


ఆర్థికసాయం అందిస్తున్న ప్రతినిధులు

క్రీడల్లో పతకాల పంట

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విజయనగరం జిల్లా అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ జట్టులో నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్ పదో తరగతి విద్యార్థి సాధు హరి ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించాడు. హరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలివాడ భాస్కరరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు పైడి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.శంకరరావు, ఎ.చిన్నవాడు తదితరులు అభినందించారు.

పొందూరు: కాకినాడలో గత నెల 28న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి టి.లోకేష్‌ను గురువారం ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పైడి సునీత అభినందించారు. బేస్‌బాల్ జట్టులో చురుగ్గా పాల్గొని రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించాడని కొనియాడారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.


వజ్రపుకొత్తూరు : విద్యార్థులతో ఉపాధ్యాయులు


శ్రీకాకుళం : లోకేష్‌ను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

జి.సిగడాం: జనవరి 27, 28, 29 తేదీల్లో కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి 66వ స్కూల్ గేమ్స్ పోటీల్లో నిద్దాం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఫెన్సింగ్‌లో గిరడ నవీన్, కెంబూరి రాజేశ్వరి రజతం, నేదూరి గౌతమ్, పాలిన యశ్వంత్, ఇప్పి విభాగంలో గిరడ లావణ్య కాంస్య పతకాలు సాధించారు. 7వ తరగతి వజ్జిపర్తి రాజేష్ రజత పతకం సాధించారు. వీరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రాహుల్‌కుమార్ తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు పి.గోవిందరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని అక్కుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు అన్నారు. సింహాచలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ విభాగంలో పాఠశాల జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జట్టు సభ్యులు కార్తీక్, చిరంజీవి, ఆకాష్, ఆర్యకృష్ణ, మోహనరావు, భవానీప్రసాద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పాపారావు మాట్లాడుతూ క్రీడాకారుల కోటాలో ఉద్యోగావకాశాలు పొంది ఎంతోమంది మంచి స్థితిలో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కుమారి, పిఇటి గీత, ఉపాధ్యాయులు ప్రశాంతి, ఉష, లీల, పార్వతి, శ్రీలక్ష్మి, పద్మ, తనూజ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే గడప గడపకు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని ఒకటో వార్డు పార్వతీశ్వరునిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏ స్థాయిలో అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగన్ పాలనపై నమ్మకం కల్పించే దిశగా నవరత్నాల సంక్షేమ పథకాల ఫలాలు ప్రజల్లో ప్రజాదరణ పొందుతూ అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలు వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలపై స్పీకర్ దృష్టికి తీసుకురాగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. తొలుత రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనరు కె.అప్పలనాయుడు, ఎఇ బి.శృజన, ఎస్ఐ ఎన్.కృష్ణ, హౌసింగ్, విద్యుత్, టిడ్కో ఎఇలు డి.సన్యాసిరావు, జి.రామారావు, రమేష్, వైసిపి నాయకులు బి.చిన్నంనాయుడు, బి.రమేష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, ఎ.ఉమామహేశ్వరరావు, డి.శ్యామలరావు, ఎస్.రామారావు, కె.అప్పలనాయుడు, ఎం.చక్రధర్, కె.రాజేశ్వరరావు, కె.పార్వతి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


స్పీకర్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

ధాన్యం బస్తాలు దగ్ధం

రైతుకు రూ.30 వేల నష్టం

ప్రజాశక్తి - పలాస

మండలంలోని జయకిష్టపురం గ్రామానికి చెందిన బి.రామకృష్ణ ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. బాధితుని కథనం మేరకు మండలంలోని లక్ష్మిపురం టోల్ గేట్ సమీపంలో ఉన్న తన సొంత పొలంలో పండించిన పంటను నూర్పు చేసి 30 బస్తాలు అమ్మకానికి సిద్ధం చేశారు. పొలంలో చెత్త చెదారం ఎక్కువగా ఉందని నిప్పు పెట్టారు. కొన్ని నిప్పు రవ్వలు ధాన్యం బస్తాలపై పడడంతో ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రైతు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు 16 ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయని తెలిపారు. సుమారు రూ.30 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు చెప్పారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాష్ట్రంలో వైసిపి పాలన అధ్వానం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష



ర్యాలీ నిర్వహిస్తున్న గౌతు శిరీష, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రంలో వైసిపి పాలన అధ్వానంగా తయారైందని, దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస మండలం పెద్దకోష్టలో గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శిరీష మాట్లాడుతూ ఎన్నికల్లో పెన్షన్ హామీని విడతల వారీగా పెంచి ప్రజలను మోసం చేశారని, ఇటువంటి పార్టీని భూ స్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ఎక్కువ స్థాయిలో గిరిజన గ్రామాలు ఉన్నప్పటికీ ఐటిడిఎ జిల్లా నుండి దూరం చేయడం ద్వారా గిరిజనులకు అన్యాయం జరిగిందని చెప్పారు. మద్యపాన నిషేధం అని చెప్పి మహిళలను మోసం చేశారని, 15 ఏళ్ల వరకు వాటిపై వచ్చిన ఆదాయాన్ని అంచనా వేసి అప్పు చేయడం విడ్డూరంగా ఉందని, అందుకు మహిళలు తీవ్రంగా ప్రతిఘటించాలన్నారు. అమ్మఒడి వచ్చిన వెంటనే నాన్న బుడ్డిగా మారి ప్రభుత్వ ఖజానాకు వెళ్లిపోతోందని విమర్శించారు. జగన్‌ది సంక్షేమం కాదు సంక్షోభం అని పేర్కొన్నారు. ఎవరు ఏమి చెప్పినా వాస్తవాలు ప్రజలు గ్రహించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఝూన్సి, దాసరి తాతారావు, మండల అధ్యక్షుడు దుర్యోధన, ప్రధాన కార్యదర్శి రుద్రయ్య, లింగరాజు, తమిరియా భాస్కర్, మంగలపాత్రో, వీరాస్వామి, ఈశ్వరరావు, గణపతి, నవీన్, మున్నా, రాంబాబు, సవర సోమేసు, అప్పారావు, డంబురు, లచ్చయ్య, ఉత్సవ్, రమ్మో, గ్రామస్తులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ


అవగాహన కల్పిస్తున్న సునీత

ప్రజాశక్తి - ఆమదాలవలస

చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళలకు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు శిక్షణను గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ శిక్షణతో మహిళలు ఆర్థికంగా మెరుగుపడటానికి మంచి అవకాశం ఉందని స్వయం ఉపాధి దిశగా నడవాలన్నారు. వీటిలో ఇనుము, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అధికమని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డిమాండ్‌కు తగినట్లుగా మన రోజువారి ఆహారంలో చిరుధాన్యాల వినియోగాన్ని పెంచి మహిళలను ఉపాధి అవకాశాల దిశగా నడిపించాలని సూచించారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి.సునీత మాట్లాడుతూ సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలతో మిక్స్ మిల్లెట్ లడ్డూలు, మురుకులు, చిరుధాన్యాల బిస్కెట్లు తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీపాన నీలవేణి, సిహెచ్ బాలకృష్ణ, హరికుమార్, మౌనిక, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులు కీలకం

ప్రజాశక్తి - జి.సిగడాం

గృహ సారథులే కీలకమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం బాతువలో రెండో రోజు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపిపి సత్యవతి మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకట రమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, బి.వెంకటరమణ, డోల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: గృహ సారథులు, కన్వీనర్లు కీలకం అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. గురువారం సంతబొమ్మాళిలో కన్వీనర్లు, గృహ సారథులతో శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అర్హత ప్రామాణికంగా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంత్‌రెడ్డి, ఎంపిపి మేరుగు రాజేశ్వరి, వైస్ ఎంపిపి ప్రతినిధి పొందల రామకృష్ణ, నక్క బీమారావు, సర్పంచులు దుక్క భూషణరెడ్డి, రెయ్య రామిరెడ్డి, కె.లక్ష్మి, నారాయణ, ఎన్ని మన్మథరావు, సూరాడ రాజారావు, భాస్కరరెడ్డి, యర్నాగుల రామరాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కళ్యాణం.. కమనీయం

కవిటి: శ్రీ వెంకటేశ్వర కళ్యాణం కమనీయం అంటూ యాత్రికులు పరవశించిపోయారు. మండలంలోని లొల్ల పుట్టుగ గ్రామంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ మహోత్సవంతో పాటు 53వ సుప్రభాత వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవోపేతంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు అప్పలస్వామి, వెంకటరమణ ఆధ్వర్యంలో రాజేష్, మాన్మథరావు సహకారంతో జరిగిన స్వామి కళ్యాణం, పూర్ణాహుతి నభూతో నభవిష్యత్ అనిపించాయి. అనంతరం జరిగిన అన్నదానంలో వేలాదిగా యాత్రికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


హరికథ చెబుతున్న సింహాచల శాస్త్రి

తాడేపల్లి సభలో ఇచ్ఛాపురం మైనార్టీలు

ఇచ్ఛాపురం: తాడేపల్లిలో హమ్ సబ్ జగన్ కే సాథ్ పేర ముస్లిం, మైనారిటీ పెద్దలతో గురువారం నిర్వహించిన సభలో ఇచ్ఛాపురానికి చెందిన ముస్లిములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో జగన్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సభలో తొలి మైనారిటీ ఉప ముఖ్యమంత్రి అమ్‌జాద్ బాషా, ఇచ్ఛాపురం వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషాతో పాటు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, జోహర్ ఖాన్, అబ్దుల్, ప్రవీజ్ ఖాన్, మనన్నా, మస్తాన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న అచ్చెన్నాయుడు

మృతుల కుటుంబాలకు అచ్చెన్న పరామర్శ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని జగన్నాథపురం, ఎస్‌బి కొత్తూరు, ఉమిలాడ పంచాయతీల్లో గురువారం మృతుల కుటుంబాలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పరామర్శించారు. జగన్నాథపురం గ్రామంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పక్కల్ల శ్రీనివాసరావు తండ్రి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పర్యటనలో భాగంగా పలువురు నాయకులు, కార్యకర్తలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని తోలాపి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు దుంపల సన్యాసి అప్పారావు మృతి పార్టీకి తీరనిలోటు అని ఎపిటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆయన ఇంటి వద్ద గురువారం ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎపిటిఎఫ్ నాయకులు అప్పారావు మృతదేహంపై ఎపిటిఎఫ్ జెండాను కప్పి నివాళి అర్పించారు. పొందూరు మండలశాఖ అధ్యక్షులు మొగదాల రమణారావు, శ్రీనివాసరావు, కొప్పల భానుమూర్తి, మజ్జి మదన్‌మోహన్, దండా సూరిబాబు, విజయ్‌కుమార్, తదితరులు సంతాపం తెలిపారు.



ముఖ హాజరును వ్యతిరేకిస్తూ ధర్నా

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం


ముఖ హాజరు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. సిఐటియు నాయకులు కె.మోహనరావు, లక్ష్మీనారాయణ, రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ ఆప్కో సంస్థ ద్వారా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ముఖ హాజరు అమలు చేయడం దారుణమన్నారు. కనీస పరిజ్ఞానం లేని పారిశుధ్య కార్మికులకు ముఖ హాజరు వల్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనరు రమేష్‌కి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీతాంబర నాయక్, బాబులా లిమ్మయి, తదితరులు పాల్గొన్నారు.


రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాలువపై పలకలు వేయాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కస్పావీధి నుంచి మార్కెట్‌లోకి వెళ్లేందుకు రోడ్డు వేశారని, రోడ్డు నుంచి వీధిలోకి వెళ్లేందుకు కాలువపై పలకలు అమర్చాలని వైసిపి నాయకులు లంక రమేష్ కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసును ఆయన ఛాంబరులో పలువురు వ్యాపారులతో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. కాలువలపై పలకలు లేకపోవడంతో రాత్రివేళల్లో అటుగా వచ్చిన వారు కాలువలో పడి గాయాలపాలవుతున్నారని వివరించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే పలకలు వేయాలని ఆదేశించారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

బొత్స దృష్టికి వంశధార నిర్వాసితుల సమస్య

ప్రజాశక్తి - కొత్తూరు

వంశధార నిర్వాసితులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని వైసిపి పాతపట్నం నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు సిఎం క్యాంపు కార్యాలయంలో గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిశారు. వినతిపత్రం అందించారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.216.7 కోట్లకు రూ.151.7 కోట్లు చెల్లించారని, మిగతా రూ.65 ఓట్ల పరిహారం చెల్లించేలా సిఎంతో మాట్లాడాలని కోరారు. దీనికి మంత్రి బొత్స సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. అనంతరం తాడేపల్లిలో పుట్ట ప్రతాప్‌రెడ్డిని కలిసి, నియోజకవర్గ సమస్యలు వివరించారు. సచివాలయ గ్రామ కన్వీనర్ల నియామకం వైసిపి వారికి కాకుండా టిడిపి వారికి ఇస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఇలాగైతే ఇబ్బందులు తప్పవని అన్నారు. గడప గడపకు కార్యక్రమ సమాచారాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇవ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



గడ్డిమందు తాగి యువకుడు మృతి

పొందూరు: మండలంలోని లోలుగు గ్రామానికి చెందిన నూతబిల్లి సూర్యనారాయణ(26) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ లక్ష్మణరావు గురువారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో భార్య శకుంతల ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. భార్య మృతి, అప్పుల కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై బుధవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుని తల్లి నీలమ్మ పోలీసులకు ఫిర్యాదు మేరకే కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

రాత్రి కావడంతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రణస్థలం

మండలంలోని పున్నానపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. కమ్మ సిగడాం యాత్ర కావడంతో పరిసర ప్రాంత ప్రజలు లేరు. సమీపంలో ఉన్న విశ్రాంత టీచర్ పున్నాన నరసింహులు అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. లైన్‌మెన్‌కు సమాచారం రావడంతో ఆయన విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. ఈ ప్రమాదం పాఠశాల తెరిచి ఉన్న సమయంలో జరిగితే భారీ నష్టం జరిగేది. ఈ ప్రమాదంలో స్కూల్‌లోని కుర్చీలు, టేబుల్స్, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి.

ట్రాక్టర్ సామగ్రి చోరీ

క్లూస్ టీమ్ పరిశీలన

ప్రజాశక్తి - జలుమూరు

ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీతో పాటు డీజిల్ దొంగతనానికి గురైన ఘటన మండలంలోని వెలుసోద గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. బాధితులు గొల్లంగి రమణారావు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం దమ్ము చేసిన అనంతరం సాయంత్రం ట్రాక్టరును పొలం వద్ద ఉంచి ఇంటికి చేరుకున్నారు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి ట్రాక్టర్ వెనుక టైర్లు రెండు, బ్యాటరీ కనిపించలేదు. ఎస్ఐ పారినాయుడు క్లూస్ టీమ్‌ను తీసుకొని ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


చోరీకి గురైన ట్రాక్టర్ పరికరాలు

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు కృష్ణ

ప్రజాశక్తి - ఆమదాలవలస

విద్యార్థులు రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పాఠశాల హెచ్ఎం ఎన్.కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు బోధనను అందిస్తున్నామని అన్నారు. వారిలోని ప్రత్యేకతలను గుర్తించి విద్యార్థులను నాలుగు గ్రేడ్లుగా విడదీసామని అన్నారు. పబ్లిక్ పరీక్షలు కఠినంగా జరుగుతాయని, విద్యార్థులు అందుకు తగ్గట్టుగా సిద్ధం కావాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, టీవీలు, సెల్ ఫోన్‌లకు దూరంగా వారిని ఉంచాలన్నారు. పాఠశాలలో చెప్పిన బోధనలను విద్యార్థులు సక్రమంగా చదువుతున్నారా? లేదా అన్నది తల్లిదండ్రులు పరిశీలన చేయాలని కోరారు. చాలామంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడం లేదని ఆకలితో ఉంటున్నారని, ఇలా అయితే చదువులపై ఎలా శ్రద్ధ వహిస్తారని, దీనిపై తల్లిదండ్రులు దృష్టి సారించి మధ్యాహ్నం భోజనం తినేలా చూడాలని, లేకుంటే ఇంటిదగ్గర భోజనాన్ని విద్యార్థులకు ఇచ్చి పంపించాలని కోరారు. పాఠశాలకు అక్షయ పాత్ర సంస్థ అందిస్తున్న భోజనం రుచిగా లేకపోవడం వల్ల విద్యార్థులకు నచ్చడం లేదని తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువచ్చారు. ఎఫ్ఎ పరీక్షలు నిర్వహించినప్పుడు బోధనలో చెప్పినవి కాకుండా ఇతర ప్రశ్నలు పరీక్షల్లో వస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువచ్చారు. ఇటువంటి సమస్య తమ దృష్టికి వచ్చిందని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కనిమెట్ట రాఘవాచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని తేలుకుంచి గ్రామ పంచాయతీలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఎంపిడిఒ రామారావు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఉపాధి పనులకు వచ్చిన కార్మికుల మస్టర్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. తేలుకుంచి, కీర్తిపురం, కొలిగాం సచివాలయంలో జరుగుతున్న జగనన్న చేదోడు రీ వెరిఫికేషన్ పనులు పరిశీలించారు. కొలిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సినేషన్ స్టాక్ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంతోష్ మండల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పలపేటలో వైద్య శిబిరం

బూర్జ: మండలంలోని అప్పలపేట గ్రామంలో గురువారం బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, 104 డాక్టర్ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 89 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. బూర్జ పిహెచ్‌సి సూపర్‌వైజర్ లక్ష్మీబాయి ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పి.ఆమని, ఎఎన్ఎం లక్ష్మీ, జె.జగదీష్, హెల్త్ అసిస్టెంట్ కె.వెంకటరమణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సత్యవతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హోర్డింగ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - సోంపేట

బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొర్లాం బాలకృష్ణ జూనియర్ కళాశాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తూ కళాశాలల వద్ద ఈ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - పలాస

యువకులకు ఉద్యోగ, ఉపాధిని కల్పించాలని, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రత, పక్కా ఇల్లు అందరికీ కల్పించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.మల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో గురువారం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ 11వ మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 200 రోజుల ఉపాధి, కనీస కూలి రూ.700 వేచ్చేలా చర్యలు చేపట్టాలని, 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, దుష్యంత్, నాగేశ్వరరావు, మహిళా సంఘం నాయకులు ఈశ్వరమ్మ, దాలమ్మ, జగదీష్, రామకృష్ణ, పాపయ్య, తవిటయ్య, మల్లేశ్వరరావు, చిన్న, అప్పారావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో జీవితాన్ని బలి చేసుకోవద్దు

ప్రజాశక్తి - పొందూరు

విద్యార్థినులు క్షణికావేశ నిర్ణయాలతో తమ జీవితాలను బలిచేసుకోవద్దు అని ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. లోలుగు కెజిబివిలో గురువారం 'చిన్నారి చేదోడు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకే తీసుకుంటున్న కఠిన నిర్ణయాలతో తమ ఉజ్వల భవిష్యత్ నాశనం అవుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పెస్ట్ సర్వేలైన్‌తో రైతులకు మేలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని చెపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్ ఆధ్వర్యంలో మినుము పంటలో పెస్ట్ సర్వేలైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెస్ట్ సర్వేలైన్ ద్వారా పురుగు, తెగుళ్లపై నిఘా పెట్టవచ్చని అన్నారు. ప్రతి వారమూ ఇలా మినుము పంటలో చేయడం వల్ల వివిధ దశల్లో వచ్చే పురుగులు, తెగుళ్లను సులువుగా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. తెగుళ్ల నివారణకు మెరుగైన పద్ధతులను రైతులకు ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేష్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో పర్యటన

పలాస : మందస మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పర్యటించారు. అందులో భాగంగా బొందుకారి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని సందర్శించి రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో మా గ్రామానికి చేరటానికి ఎన్నో ఇబ్బందులు పడ్డామని, అప్పటి శాసనసభ్యులు శివాజీ మా పరిస్థితి తెలుసుకొని రహదారి సౌకర్యం కల్పించారని, ఆ తరువాత ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదని చెప్పారు. శిరీష మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపికి అధికారం చేపడుతుందని, రోడ్డు బాగు చేయడంతో పాటు గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బొందుకారి రహదారి పరిస్థితి చూస్తే ఈ ప్రభుత్వ అసమర్థత అర్థమవుతుందని పేర్కొన్నారు. మొదట నుండి గిరిజనులను వైసిపి చిన్నచూపు చూస్తుందన్నారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు, బొందుకారి గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కవిటి

సైబర్ ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.రాము అన్నారు. స్థానిక ఎస్‌విజి విద్యా సంస్థల్లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సైబర్, ఆన్‌లైన్ మోసాలపై గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ద్వారా ఎక్కువగా నగదు చోరీలు జరుగుతున్నాయని, ఒటిపిల పేరుతో మన సమస్త సమాచారం దొంగలిస్తున్నారని ఎస్ఐ అన్నారు. విద్యార్థులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉంటూ తమ బంధువులు, చుట్టాలు, గ్రామస్తులను చైతన్యపరచాలని కోరారు. మొబైల్ ఉపయోగించినప్పుడు సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే అనవసర లింకులు ఓపెన్ చేయకుండా, వారికి ఒటిపిలు చెప్పకుండా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 నెంబరుకు సంప్రదించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నీలకంఠం, ఎస్‌విజి సిబ్బంది పాల్గొన్నారు.

పనికి తగిన కూలి చెల్లించాలి

ప్రజాశక్తి - పలాస

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పనికి తగ్గ కూలి చెల్లించేలా చూడాలని హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్ అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ ఉపాధి హామీ చట్టంపై సామాజిక తనిఖీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి పలాస మండలంలోని పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం ప్రతినిధులు గ్రామసభలు జరిపారు. జనవరి 19 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగిన గ్రామసభల్లో ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై చర్చించారు. కార్మికులు, గ్రామస్తుల చెప్పిన లోపాలను సరి చేశారు. ఫీల్డ్‌తో పాటు మండల స్థాయి అధికారులతో ఈ ప్రజావేదిక నిర్వహించారు. వివిధ అంశాల వారీగా సభలో సమీక్షించారు. ప్రధానంగా పలు గ్రామాల్లో ఎంబుక్ సరిగా నిర్వహించడం లేదని, కూలీల హాజరులో తప్పులు ఉన్నాయని, ఇవి పునరావతం కాకూడదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలాస ఎంపిడిఒ రమేష్‌నాయుడు, టెక్కలి డివిజన్ ఎపిడి మురళీకృష్ణ, జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు, పలాస క్లస్టర్ ఎపిడి అమ్మినాయుడు, పంచాయతీరాజ్ డిఇ రవి, మండల సర్పంచులు, ఎంపిటిసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సత్ఫలితాలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు సాధ్యపడతాయని ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రేణుక అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత ఉండి ఏ కారణంతో నైనా అర్హులకు పథకాలు అందకపోతే మండల స్థాయి అధికారులతో పాటు మా దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత వరకు ప్రగతి సాధించవచ్చని తెలిపారు. మండల సచివాలయాల సమన్వయకర్తగా నియమితులైన బొడ్డేపల్లి నిరంజన్ పరిచయం చేసుకొని ప్రభుత్వ పథకాలను గ్రామాలలో లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యా సంక్షేమాధికారి పైడి కూర్మారావు, ఎఒ వాసుదేవరావు తోపాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

పలాస: కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద గురువారం పలాస నుంచి సోంపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రోడ్డుకు ఇరువైపులా సుమారు అర కిలోమీటరు దూరం మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో సమస్య సద్దుమణిగింది.



కాశీబుగ్గలో నిలిచిపోయిన ట్రాఫిక్

ఎస్‌టి ధ్రువపత్రం ఎలా ఇస్తారు?

ప్రజాశక్తి - కవిటి

బెంతు ఒరియాలకు ఎస్‌టి కుల ధ్రువపత్రం ఎలా జారీ చేస్తారని, ఇకపై అలా ఏచ్చే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని ఆదివాసీ(గిరిజన) చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సవర చొక్కరావు స్పష్టం చేశారు. గురువారం కవిటి తహశీల్దార్ ఆర్.అప్పలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బెంతు కొరియాలకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుపై కోర్టులో కేసు నడుస్తోందని, కులధ్రువపత్రం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తక్షణమే జారీ చేసిన ధ్రువపత్రాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తహశీల్దారును కోరారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతమైతే సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు పెడతామని చొక్కారావు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యర్ర రాజారావు, ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ షణ్ముఖరావు, ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక పాతపట్నం మండలం అధ్యక్షుడు, జెఎసి కోశాధికారి జన్ని సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మండలంలోని కట్యాచార్యులపేట పంచాయతీ హనుమంతపురం గ్రామానికి కొర్లకోట-భీమలవలస ఆర్అండ్‌బి రహదారి నుండి ఎపిఆర్ఆర్‌పి గ్రాంటు రూ.70 లక్షల రూపాయలతో 700 మీటర్లు సిసి రోడ్డు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రహదారి నిర్మాణం ఇప్పటికీ పరిష్కారం కావడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, వైసిపి మండల అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు ఎన్ని రామచంద్రరావు, సైలాడ దాసునాయుడు, చిలకలపల్లి సురేష్, చలపతిరావు, పేడాడ వెంకటరమణ, జి.చంద్రరావు, పంచాయతీరాజ్ ఇంజినీరు అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - పొందూరు

మేజర్ పంచాయతీలో రెండు వారాలుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గురువారం సర్పంచ్ రేగిడి లక్ష్మీ ఆధ్వర్యంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. రెల్లిగెడ్డ సమీపంలో ఈ తాగునీటి పైపులైన్ పాడైపోవడంతో నీరు సరఫరా లేక ప్రజలు చాలా అవస్థలు పడాల్సి వచ్చింది. పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతున్నామని, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరాను పునరుద్ధరించి కుళాయిల ద్వారా నీరు అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

డ్రెయినేజీ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని పరుశురాంపురం పంచాయతీ పెద్దమడి కాలనీలో డ్రెయినేజీ పనులకు వైస్ ఎంపిపి ఆదినాయుడు, సర్పంచ్ టి.ప్రసాద్ గురువారం భూమి పూజ చేశారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, వెంకటేష్, అప్పలస్వామి, బాబురావు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.